క్లుప్తంగా

సకాలంలో రుణాలు చెల్లించాలి



గ్రామ సంఘాలతో సమావేశమైన వెలుగు సిబ్బంది

రోలుగుంట: రుణాలు నిర్ణీత వ్యవధిలో జమ చేయడం ద్వారానే సంఘాల అభివృద్ధి ఉంటుందని వెలుగు ఏపీఎం సాధన తెలిపారు. సీసీ పద్మ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు ప్రగతి కార్యాలయంలో గ్రామస్థాయి ద్వాక్రా సంఘాల ప్రతినిధులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘాల వారీగా తీసుకున్న రుణాలు, జమల్లో వెనుకబడిన సంఘాలు, అందుకు గల కారణాలు, వాటి అభివృద్ధిపై చర్చించారు. కొత్త సంఘాలు ఏర్పాటుపైన, నిర్వహణపై అవగాహన కల్పించారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని ఎంఈవో నరేష్ సూచించారు. పదో తరగతి ఫలితాల్లో స్థానిక ఉన్నత పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం ఆయన అభినందించారు. భవిష్యత్ చదువులో ఇలాగే మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు ఘన సన్మానం



సన్మానం చేస్తున్న సిబ్బంది

గొలుగొండ: చీడిగుమ్మల-1 అంగన్‌వాడీ కార్యకర్తగా పదవీ విరమణ పొందిన పి.గాటీలును సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు మాట్లాడుతూ 30 సంవత్సరాలపాటు కార్యకర్తగా పనిచేసిన గాటీలు ఎంతోమంది చిన్నారులను తీర్చిదిద్దారన్నారు. ప్రధానంగా చిన్నారులకు సృజనాత్మకమైన విద్యతో చదువుల పట్ల ఆసక్తి కలుగుతుందని తెలిపారు. గొలుగొండ సీడీపీవో శ్రీగౌరీ, మాజీ ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొండపాలెంలో 'గడప గడపకు'

బుచ్చెయ్యపేట: కొండపాలెం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు గుమ్మిడి రాజునాయుడు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సంక్రమంగా అందుతున్నయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

###఼ారెత్తిస్తున్న ఎండలతో ప్రజల ఉక్కిరిబిక్కిరి



ఎండలతో నిర్మానుష్యంగా మారిన సింగన్నదొర

కె.కోటపాడు: గ్రామాల్లో నాలుగు రోజులగా పగటి వేళ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సేద తీరిన ప్రజలు మరలా ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి రోడ్లపైకి రావాలంటేనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండతోపాటు ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు ఇక్కట్లకు గురవుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో వేసవి ఉష్ణోగ్రతలతో జనసంచారం లేక ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి.

నిబంధనల ప్రకారమే మెయిన్ రోడ్డు విస్తరణ

- నర్సీపట్నం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు



సమావేశానికి హాజరైన భవన యజమానులు

నర్సీపట్నం: చట్టంలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా మెయిన్‌రోడ్డు విస్తరణ చేపడుతున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణపై భవన, స్థల యజమానులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వందడుగులు కాకుండా 80 అడుగులకు రోడ్డు విస్తరించడంతోపాటు ఆరు నెలలు వ్యవధి ఇవ్వాలని యజమానులు కోరారు. దానికి చైర్మన్ కల్పించుకుని రోడ్డు విస్తరణ ప్రక్రియ చేపట్టి అర్నెల్లు గడిచిన తర్వాత గడువు అడగటం సరికాదన్నారు. టీడీఆర్ బాండ్లుపై ఏమైనా అభ్యంతరాలు అధికారులు నివృతి చేస్తారన్నారు. అనంతరం కమిషనర్ కనకారావు మాట్లాడుతూ చట్ట ప్రకారం రోడ్డు విస్తరణ చేపడుతున్నామన్నారు. ప్రజావసరాల దృష్ట్యా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమానికి సహకరించాలన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ ప్రకారం వందడుగులు రోడ్డు విస్తరించడం జరుగుతుందన్నారు. చట్టంలో పేర్కొన్న విధంగా నష్టపరిహారం నగదు రూపంలో కాకుండా ప్రభుత్వం బాధితులకు టీడీఆర్ బాండ్లను మాత్రమే ఇస్తుందని స్పష్టం చేశారు. యజమానులు సహకరించకపోతే చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి తామే నిర్మాణాలను తొలగిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక గాలి వీధిలో సత్యనారాయణ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కళ్ల నాయుడుబాబు, రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, కె.కోటపాడు రూరల్ సీఐ ఎస్. తాతారావు, ఎస్ఐ డి. నాగేంద్ర, ఉమ్మడి విశాఖ జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజ్ఞానానికి గ్రంథాలయాలు దోహదం



మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

గొలుగొండ: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం బుక్ రీడింగ్ నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వేసవి సందర్భంగా ఆరోగ్య సూత్రాలపై ఆయన అవగాహన కల్పించారు. గ్రంథపాలకుడు రాజుబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు వన్నె తెచ్చిన సీఎం

- జైతవరంలోని గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

చీడికాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు అందిస్తూ సంక్షేమ పాలనకు మరింత వన్నె తెచ్చారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం జైతవరంలో ఆయన ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది మహిళలు వినతి మేరకు అర్హతను పరిశీలించి అభయ హస్తం పింఛన్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అభయ హస్తం పింఛన్ రూ.500 అందజేశారని గుర్తు చేశారు. ఉప్పలగూడెం నుంచి జైతవరం మీదుగా అప్పలరాజుపురం వరకు రోడ్డు నిర్మాణానికి రూ 1.75 కోట్లు, ఎల్.బి.పట్నం నుంచి కె.ఎల్.బి.పట్నం మీదుగా మాడుగులకు రూ.2.55 కోట్లు రోడ్లు నిర్మాణానికి మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. జైతవరం గ్రామానికి ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.90 లక్షలు మంజూరు చేశామన్నారు. గ్రామంలో డ్రైనేజీలతో పాటు సీసీరోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గ్రామ దేవత ఆలయం వద్ద తాగునీటి బోరు మంజూరు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, గుడ్లు ఎవరందిస్తున్నారని చిన్నారులను అడగ్గా, వెంటనే జగన్ మామయ్య అని బదులివ్వడంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, ఎంపీపీ కురసా జయమ్మ, జెడ్పీటీసీ లాలం జానకీరామ్, సర్పంచ్ కోడూరు సత్యవతి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు యర్రా అప్పారావు, మండల యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, ఓఎస్‌డీ ఎం. పోలినాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు చౌడువాడలో గడప గడపకు మన ప్రభుత్వం

కె.కోటపాడు: చౌడువాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఉదయం 7 గంటలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు సమస్యలకు పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు శచీదేవి తెలిపారు. అధికారులు హాజరు కావాలన్నారు.

పచ్చరొట్ట విత్తనాలు విక్రయానికి సిద్ధం

మాడుగుల రూరల్: సబ్సిడీపై పచ్చరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు ఏవో ఎం. వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ పది కిలోలు రూ.395, జనుము విత్తనాలు పది కిలోలు రూ.420, పిల్లిపెసర విత్తనాలు 8 కిలోలు రూ.388 చొప్పున విక్రయిస్తామని, రైతులు తమ ఆధార్ కార్డుతో రైతు భరోసా కేంద్రాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

దేవరాపల్లి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి రెండో విడత 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఈ నెల 15 వరకు గడువు ఉందని ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు బుధవారం తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి గాను తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామన్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రైతులకు పాసుపుస్తకాల పంపిణీ



పాసుపుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

మాకవరపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో మంజూరైన 580 పాసుపుస్తకాలను తహసీల్దార్ ప్రసాదరావు పంపిణీ చేశారు. మండలంలోని మాకవరపాలెం, తాడపాల, పి.పి.అగ్రహారం, సీతన్నఅగ్రహారం, జంగాలపల్లి గ్రామాల్లో రీ సర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లు వేసే పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో రైతులకు మంజూరైన పాసుపుస్తకాలను బుధవారం స్థానిక సచివాలయంలో రైతులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, కార్యదర్శి సుదర్శనరావు, వీఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం



గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



ఉప్పవరంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో బుధవారం ధర్మ ప్రచారం నిర్వహించారు. హిందూ ధర్మ రక్షణకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరిగి హిందూ ధర్మంపై ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ మండల కన్వీనర్ తాడి సూరిమూర్తి తెలిపారు. చిన నర్సాపురం గ్రామంలో కూడా సీతారామ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 50 గడపలకు వెళ్లి సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ కన్వీనర్ మేడిశెట్టి దివాణం, సబ్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి, డివిజన్ ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.

ఉప్పవరంలో ఇంటింటికీ ధర్మ ప్రచారం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరంలో బుధవారం ఇంటింటికీ ధర్మ ప్రచారం నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ చిన్నినాయుడు, గంగిరెడ్డి రోహిత్, ఎస్.భాను, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధికి నిధులు పెంచాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామీణఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచి, కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము కోరారు. బుధవారం ఆయన అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెంలో గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సమావేశమై మాట్లాడారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ కూలీల విషయంలో అనేక మార్పులు తీసుకువస్తుందని, ఇది కూలీల పట్ల శరాఘాతంగా మారిందన్నారు. పాత పద్ధతిలో కూలీలకు న్యాయం చేసి, కూలి ధర పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు, సుశీల,గంగరాజు, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



నోటీసు బోర్డులో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నర్సీపట్నంలోని 11 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. గంట ముందు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల ఎలాంటి అవాంఛనీయ సంఘటలను తలెత్తకుండా 144వ సెక్షన్ విధించారు. 2,588 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు.

తాటి ముంజెలకు గిరాకీ



మునగపాకలో తాటిముంజెల అమ్మకాలు

మునగపాక : వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు తాటి ముంజెలను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో దొరికే తాటి కాయలతో పాటు ముంజెలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇదే అదనుగా అమ్మకందారులు తాటికాయను రూ.10కు విక్రయిస్తున్నారు. డజను ముంజెలను రూ.40 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. మునగపాక ఎస్‌బీఐ దరి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

రాగి జావ పంపిణీకి స్టీల్ గ్లాసులు



రోలుగుంట: స్టీల్ గ్లాసులను లెక్కిస్తున్న ఉద్యోగి సత్తిబాబు



బుచ్చెయ్యపేట :ప్రభుత్వం సరఫరా చేసిన స్టీల్ గ్లాసులు

బుచ్చెయ్యపేట: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రాగిజావ అందించేందుకు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రానికి స్టీల్ గ్లాసులు చేరాయి. మండలంలో 35 పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రాగి జావ అందించేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాసులను ప్రభుత్వం సరఫరా చేసింది. మండలంలోని 58 పాఠశాలల్లో 5,600 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో రోజూ రాగి జావ అందేలా చేస్తామని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. **రోలుగుంట:** స్థానిక విద్యా వనరుల కేంద్రానికి వాహనంపై బుధవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయం నుంచి 3,161 స్టీల్ గ్లాసులు వాహనంలో వచ్చాయి. వీటిని ఇక్కడ ఉద్యోగి రుత్తల సత్తిబాబు లెక్క చూసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని 54 పాఠశాలల్లో విద్యార్థులందరికీ త్వరలోనే ఎంఈవో సాయిశైలజ ఆదేశాలతో ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేస్తారని ఆయన వివరించారు.

విద్యా కానుక పంపిణీకి ముందస్తు ప్రణాళిక



విద్యా కానుకపై వివరిస్తున్న ఎంఈవో అమృత్‌కుమార్

నాతవరం: జగనన్న విద్యా కానుక సకాలంలో అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ల పరిధిలో పాఠశాలల వారీగా ప్రభుత్వం అడిగిన సమాచారం సకాలంలో ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం మండలానికి 50 శాతం పాఠ్యపుస్తకాలు, రాగి జావా తాగేందుకు స్టీల్ గ్లాసులు వచ్చాయన్నారు. పాఠశాలలు తెరిచే సమయానికి అన్ని పాఠశాలలకు ఒకేసారి విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందాలన్నారు. ఈ విషయంలో సీఆర్పీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. ప్రధానంగా ఉచిత ప్రవేశాల కోసం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పి. నాగేశ్వరరావు, గోవింద్, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది సాంబ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

33 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



వేచలంలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి హారిక

దేవరాపల్లి: ప్రతీ గర్భిణి సురక్షితంగా ప్రసవించడమే ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ యోజన ముఖ్యోద్దేశమని వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి. హారిక తెలిపారు. పీఎంఎస్ఎంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో బుధవారం 33 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువులను సైతం నమోదు చేశారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డ జన్మిస్తారని, ప్రశాంత వాతావరణంలో తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

13న జాతీయ లోక్ అదాలత్

- జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

నర్సీపట్నం: ఈ నెల 13 నిర్వహిస్తున్న మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు రాజీ పడదగిన కేసుల్లో శ్రద్ధ వహించి ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది వి.బి. రామచంద్రారవు, సీనియర్ న్యాయవాదులు పొక్కునూరు నరసింహం, గొలుసు శంకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు



కె. వల్లాపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

మాడుగుల రూరల్: మండలంలో రెండు గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలోని కింతలి వల్లాపురంలో 83 మందిని మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీలక్ష్మి పరీక్షించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ రత్నం, ఏఎన్ఎం కె. శ్రీదేవి, ఆరోగ్య సహాయకులు రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో...

కె.జె.పురం పీహెచ్‌సీ పరిధి కె.జె.పురం సచివాలయంలో 63 మందిని వైద్యాధికారి కె. లీలా ప్రసాదు పరీక్షించారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సీహెచ్‌వో జి. కామేశ్వరి, ఏఎన్ఎంలు శ్రావణి, అచ్యుతాంబ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చురుగ్గా ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పనులు



ఆర్‌అండ్‌బీ అతిథిగృహ నిర్మాణం

మాడుగుల: బ్రిటీష్ హయాం నాటి ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పూర్తి స్థాయిలో శిథిలమైంది. దీని స్థానంలో నూతన భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో రూ.50 లక్షలు మంజూరయ్యాయి. వీటితో ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 30 ఏళ్లుగా శిథిలమైన ఆర్‌అండ్‌బీ అతిథిగృహం స్థానంలో కొత్త భవన నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.